క్లుప్తంగా

మున్సిపల్ చైర్మన్‌కు సన్మానం



ఆదోని మున్సిపల్ తాత్కాలిక చైర్మన్‌ను సన్మానిస్తున్న వైస్ చైర్మన్, కౌన్సిలర్లు

ఆదోని టౌన్: ఆదోని మున్సిపల్ తాత్కాలిక చైర్మన్‌గా బాధ్యతలు చేపట్టిన ఎంఎంగౌస్‌ను వైస్ చైర్మన్ నరసింహులు, కౌన్సిలర్లు కిషోర్, ఉస్మాన్, అహ్మద్, బాలాజీ, మమ్మత్తుస్వామి, వసీం తదితరులు గురువారం ఘనంగా సన్మానించారు. మున్సిపల్ చైర్మన్ చాంబర్‌లో ఎంఎంగౌస్‌కు శుభాకాంక్షలు తెలియజేసి, శాలువాలు కప్పి పూలమాలలు వేసి సత్కరించారు. ఆదోని మున్సిపాలిటీని అన్నివిధాలా అభివృద్ధి చేస్తానని, ప్రజా సమస్యల పరిష్కారం కోసం నిరంతరం పాటుపడతానని ఎంఎంగౌస్ తెలిపారు.

బిడ్డకు ముర్రుపాలే శ్రేష్టం



కోసిగి హాస్పిటల్‌లో గర్భిణిని విచారిస్తున్న నోడల్ ఆఫీసర్ రఘు

కోసిగి: పుట్టిన వెంటనే బిడ్డ ముర్రు పాలు పట్టిస్తే బిడ్డ ఆరోగ్యాన్ని చాల శ్రేష్టమని జిల్లా సంచార చికిత్స కార్యక్రమ అధికారి, నోడల్ ఆఫీసర్ డాక్టర్ రఘు అన్నారు. గురువారం కోసిగి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించి ప్రసవం జరిగిన మహిళలు, పుట్టిన బిడ్డల ఆరోగ్య విషయాలు అడిగి తెలుసుకున్నారు. ఆయన మాట్లాడుతూ పుట్టిన వెంటనే గంట లోపు తల్లి పాలు పట్టిస్తే బిడ్డకు వ్యాధి నిరోధక శక్తి పెరిగి సంపూర్ణ ఆరోగ్యవంతంగా ఎదుగుదలకు దోహదపడుతోందన్నారు. డాక్టర్ రజిత, ప్రాజెక్టునిష్టు ఖలీల్ పాల్గొన్నారు.

కోసిగికి చేరిన పాఠ్య పుస్తకాలు



కోసిగి బాలుర ఉన్నత పాఠశాలలో పుస్తకాలను పరిశీలిస్తున్న ఎంఈఓ శోభారాణి

కోసిగి: 2025–2026 విద్యా సంవత్సరానికి గానూ పాఠ్యపుస్తకాలు గురువారం కోసిగికి వచ్చినట్లు ఎంఈఓ శోభారాణి తెలిపారు. మొదటి విడతగా మండలానికి నాలుగు బస్సులలో 44 వేల పాఠ్య పుస్తకాలు వచ్చాయన్నారు. వచ్చిన పుస్తకాలను కోసిగి బాలుర ఉన్నత పాఠశాలలోని అదనపు గదులలో భద్రపరిచినట్లు తెలిపారు. పాఠశాలలు తెరిచే నాటికి ఉపాధ్యాయుల సమక్షంలో వివిధ పాఠశాలలకు చేరుస్తామని చెప్పారు.

మద్యం సేవించి వాహనాలు నడిపితే చర్యలు



వాహనదారుడిని పరీక్షిస్తున్న పోలీసులు

గోనెగండ్ల : మద్యం సేవించి వాహనాలు నడిపితే చట్టరీత్యా చర్యలు తీసుకుంటామని సీఐ విజయభాస్కర్ హెచ్చరించారు. గురువారం సాయంత్రం గాజులదిన్నె ప్రాజెక్టు స్టేజ్ వద్ద పోలీసులు వాహన తనిఖీ చేపట్టారు. వాహనదారులకు బ్రీతింగ్ అనలైజర్ ద్వారా శ్వాస పరీక్షలు నిర్వహించి, మద్యం సేవించి వాహనాలు నడిపిన వారికి జరిమానా విధించారు. సీఐ మాట్లాడుతూ మద్యం సేవించి డ్రైవింగ్ చేయడం ద్వారా మీతో పాటు ఇతర వాహనదారులు ఇబ్బందులు పడతారని చెప్పారు. అలాగే ప్రమాదాలు జరిగే అవకాశాలు కూడా ఎక్కువగా ఉంటాయన్నారు.

వార్డు కౌన్సిలర్‌కు పితృ వియోగం



నివాళులర్పిస్తున్న మాజీ ఎమ్మెల్యే సాయిప్రసాద్‌రెడ్డి

ఆదోని టౌన్: పట్టణంలోని 20వ వార్డు ఇందిరానగర్ వార్డు కౌన్సిలర్ మధుబాబు తండ్రి మీనిగ నరసింహులు గురువారం మృతిచెందారు. విషయం తెలుసుకున్న మాజీ ఎమ్మెల్యే సాయిప్రసాద్‌రెడ్డి మీనిగ నరసింహులు మృతదేహాన్ని సందర్శించి పూలమాలలు వేసి నివాళులర్పించారు. వైఎస్సార్‌సీపీ అభివృద్ధికి మీనగ నరసింహులు కృషి చేశారన్నారు. ఆయన సేవలు మరువలేనివన్నారు. వైఎస్సార్‌సీపీ నాయకులు చంద్రకాంత్‌రెడ్డి, కామిరెడ్డి, 19వ వార్డు కౌన్సిలర్ చలపతి, విశ్వనాథ్ తదితరులు ఉన్నారు.



మాట్లాడుతున్న పార్టీ జిల్లా అధ్యక్షుడు ఎస్వీ మోహన్‌రెడ్డి



సమావేశంలో పాల్గొన్న నియోజకవర్గ పార్టీ శ్రేణులు



వైఎస్సార్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న నేతలు

కార్యకర్తలకు అండగా ఉంటాం

- వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు ఎస్వీ మోహన్‌రెడ్డి
- ఎమ్మిగనూరులో వచ్చే ఎన్నికల్లో మళ్లీ వైఎస్సార్‌సీపీ జెండా ఎగురవేద్దాం
- 11నెలలు గడుస్తున్నా హామీలు అమలు చేయలేని కూటమి ప్రభుత్వం
- పట్టణంలో వైఎస్సార్‌సీపీ శ్రేణుల ఆత్మీయ సమావేశం
- పార్టీ శ్రేణుల్లో నూతనోత్సాహం

ఎమ్మిగనూరుటౌన్: టీడీపీ అరాచకాలను ఎదుర్కోవాలని, కార్యకర్తలకు పార్టీ అండగా వుంటుందని వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు ఎస్వీ మోహన్‌రెడ్డి భరోసానిచ్చారు. ఎన్నికల ముందు సూపర్ సిక్స్ పథకాలిస్తామంటూ ప్రజలను మభ్యపెట్టి గద్దెనెక్కి 11 నెలలు గడిచినా వాటిని అమలు చేయలేక చేతులెత్తేసిన కూటమి ప్రభుత్వ వైఫల్యాలను వైఎస్సార్‌సీపీ శ్రేణులు ప్రజల్లోకి తీసుకెళ్లి వారిలో చైతన్యం తేవాలన్నారు. గురువారం పట్టణంలోని మాచాని సోమప్ప మెమోరియల్ హాల్‌లో నియోజకవర్గ ఇన్‌చార్జ్ బుట్టా రేణుక ఆధ్వర్యంలో నియోజకవర్గ స్థాయి వైఎస్సార్‌సీపీ శ్రేణుల ఆత్మీయ సమావేశం జరిగింది. అంతకు మునుపు స్థానిక దివంగత మహానేత వైఎస్సార్ విగ్రహానికి ఎస్వీ, బుట్టా రేణుక, జిల్లా ఉపాధ్యక్షుడు ఎర్రకోట జగన్‌మోహన్‌రెడ్డి పూలమాల వేసి నివాళులర్పించి మెమోరియల్ హాల్ వరకు ర్యాలీగా వెళ్లారు. జిల్లా అధ్యక్షుడు జ్యోతి ప్రజ్వలన కార్యక్రమాన్ని ప్రారంభించారు.

ప్రజలను పక్కదోవ పట్టించే యత్నం

కూటమి ప్రభుత్వం సూపర్ సిక్స్ పథకాలు అమలు చేయక, ప్రజలను పక్కదోవ పట్టించేందుకు యత్నిస్తోందని జిల్లా అధ్యక్షుడు ఎస్వీ అన్నారు. అందులో భాగంగానే తిరుపతి లడ్డూ కలుషితం అయిందని ప్రచారం చేసిదని.. ఇలా దేవుడి లడ్డూను కూడా రాజకీయాల కోసం వాడుకుందన్నారు. అధికారంలోకి వచ్చి నెలలు గడుస్తున్నా హామీలు అమలు చేయలేదన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోని వచ్చి రూ.1.70లక్షల కోట్ల అప్పు తప్ప ప్రజలకు చేసిందేమీ లేదన్నారు.

స్థానిక సంస్థల ఎన్నికలకు సిద్ధం కావాలి

వైఎస్సార్‌సీపీ శ్రేణులు ఐక్యతతో వచ్చే స్థానిక సంస్థల ఎన్నికలకు సిద్ధం కావాలని ఎస్వీ పిలుపునిచ్చారు. గత అసెంబ్లీ ఎన్నికల్లో కేవలం 10శాతం ఓట్లతో పార్టీ అధికారం కోల్పోయిందని అయినా పార్టీ కార్యకర్తల్లో పట్టు సడలలేదన్నారు. అదే పట్టుదలతో కూటమి ప్రభుత్వాన్ని వచ్చే ఎన్నికల్లో కూలదోయడానికి సిద్ధం కావాలన్నారు. మాజీ ఎమ్మెల్యే చెన్నకేశవరెడ్డి, నియోజకవర్గ ఇన్‌చార్జ్ బుట్టా రేణుకల ఆధ్వర్యంలో వచ్చే ఎన్నికల్లో ఎమ్మిగనూరులో మళ్లీ వైఎస్సార్‌సీపీ జెండాను ఎగురవేద్దామని పిలుపునిచ్చారు. వైఎస్ జగన్‌ను మళ్లీ సీఎంగా చేసుకోవడమే లక్ష్యంగా ఐక్యతతో పనిచేయాలని సూచించారు. ఈవీఎంలతో మోసం చేసి గద్దెనెక్కిందని కూటమి ప్రభుత్వంపై ఎన్నో ఆరోపణలున్నాయన్నారు.

ఐక్యంగా పని చేద్దాం

వైఎస్సార్‌సీపీని మళ్లీ అధికారంలోకి తెచ్చుకునేందుకు పార్టీ శ్రేణులు విభేదాలులేకుండా ఐక్యంగా పని చేద్దామని నియోజకవర్గ ఇన్‌చార్జ్ బుట్టా రేణుక పిలుపునిచ్చారు. గత ఎన్నికల్లో 40శాతం ఓట్లు వచ్చాయంటే పార్టీ పటిష్టంగా ఉన్నందువల్లే అన్నారు. కూటమి ప్రభుత్వం వల్ల వైఎస్సార్‌సీపీ శ్రేణులు ఇబ్బంది పడకుండా తాము అండగా వుంటామన్నారు. రాష్ట్రాన్ని అప్పులు చేస్తూ కూటమి ప్రభుత్వం తన పబ్బం గడుపుకుంటోందన్నారు. ఇప్పటికే కూటమి ప్రభుత్వంపై ప్రజల్లో అసంతృప్తి వచ్చిందన్నారు. లక్ష్యసాధన కోసం పార్టీ శ్రేణులంతా కలిసి పని చేయాలని కోరారు. కలిసి ముందుకు నడిచి నియోజకవర్గంలో పార్టీని మరింత బలోపేతం చేసుకుందామన్నారు.

తమ కుటుంబానికి వైఎస్ జగన్ న్యాయం చేస్తారు

ఎన్నో ఏళ్లుగా దివంగత నేత వైఎస్సార్‌కు తాము విధేయులుగా వున్నామని, అందుకు గాను తమ కుటుంబానికి మాజీ సీఎం వైఎస్ జగన్ న్యాయం చేస్తారని మాజీ ఎమ్మెల్యే చెన్నకేశవరెడ్డి ధీమా వ్యక్తం చేశారు. పార్టీలో ఐక్యత అవసరమని, వైఎస్సార్‌సీపీని గెలిపించేందుకు తాము, బుట్టా రేణుక కలిసి పనిచేస్తామని చెప్పారు. వైఎస్ జగన్ హయాంలో అన్ని వర్గాలు బాగుపడ్డాయన్నారు. విద్య, వైద్యం కోసం ఎన్నో కోట్ల రూపాయలు ఖర్చు పెట్టిన ఘనత మాజీ సీఎం వైఎస్ జగన్‌దేనన్నారు.

పార్టీ శ్రేణుల్లో జోష్

పార్టీ శ్రేణుల ఆత్మీయ సమావేశంలో మాజీ ఎమ్మెల్యే చెన్నకేశవరెడ్డి, ఇన్‌చార్జ్ బుట్టారేణుక, ఎర్రకోట జగన్‌మోహన్‌రెడ్డి పాల్గొనడంతో పార్టీ శ్రేణుల్లో జోష్ వచ్చినయ్యింది. సమావేశంలో వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి తెర్నెకల్ సురేందర్‌రెడ్డి. జిల్లా ఉపాధ్యక్షుడు ఎర్రకోట జగన్‌మోహన్‌రెడ్డి, పార్టీ వీరశైవలింగాయత్ రాష్ట్ర అధ్యక్షుడు రుద్రగౌడ్, బుట్టా శివనీలకంఠ, మున్సిపల్ చైర్మన్ డాక్టర్ కేఎస్ రఘు, యువనాయకులు బుట్టాప్రతూల్, రాజీవ్‌రెడ్డి, పార్టీ మండల అధ్యక్షుడు బసిరెడ్డి భీమిరెడ్డి, పట్టణ అధ్యక్షుడు కామర్తి నాగేశప్ప పాల్గొన్నారు.

రైల్వే ఆస్తులను ధ్వంసం చేస్తే కేసులు



ట్రాక్ దాటుతున్న వారికి అవగాహన కల్పిస్తున్న రైల్వే ఎస్ఐ మల్లేశ్వరయ్య

ఆదోని సెంట్రల్: రైల్వేకు సంబంధించిన ఆస్తులను ధ్వంసం చేస్తే కేసులు బనాయిస్తామని రైల్వే ఎస్ఐ మల్లేశ్వరయ్య హెచ్చరించారు. రైల్వే ట్రాక్ దాటుతున్న వారికి గురువారం అవగాహన కల్పించారు. వారు మాట్లాడుతూ రైళ్ల రాకపోకల సమయంలో ప్రజలు ట్రాక్‌పై అటూ ఇటూ తిరగడం వలన ప్రమాదాలు చోటు చేసుకుంటాయని నల్లగేటు వద్ద గోడలు నిర్మించడం జరిగిందన్నారు. కొంతమంది గోడలను పగలగొట్టి రైల్వే ట్రాక్‌ను దాటడానికి రస్తా చేసుకున్నారని తెలిపారు. దీంతో పశువులను కూడా రైల్వే ట్రాక్‌పై వదుతున్నారన్నారు. అనుకోని ప్రమాదాలు జరిగితే తీరని నష్టం జరుగుతుందని తెలిపారు. 10 నిమిషాలు లేట్ అయినా మనకు సూచించిన దారిలోనే వెళ్లడం మంచిదన్నారు. ట్రాక్ దాటుతున్నప్పుడు కూడా అప్రమత్తంగా ఉండాలన్నారు. రైల్వే హెడ్ కానిస్టేబుల్ సంజయ్ కుమార్ సిబ్బంది పాల్గొన్నారు.

పదవీ విరమణ అధ్యాపకుడికి సన్మానం



పదవీ విరమణ పొందిన అధ్యాపకుడిని సన్మానిస్తున్న పాలిటెక్నిక్ కళాశాల సిబ్బంది

ఆదోని సెంట్రల్: స్థానిక పాలిటెక్నిక్ కళాశాలలో అధ్యాపకుడిగా పని చేస్తూ ఇటీవల పదవీ విరమణ పొందిన జింకా సుబ్బరాయుడును తోటి అధ్యాపకులు, విద్యార్థులు ఘనంగా సన్మానించారు. కళాశాలలో గురువారం ఏర్పాటు చేసిన సన్మాన కార్యక్రమంలో ప్రిన్సిపాల్ సుధాకర్ రెడ్డి మాట్లాడుతూ కళాశాలలో విద్యార్థుల విద్యాభివృద్ధికి సుబ్బరాయుడు దాదాపు రూ. 10 లక్షల వరకు విరాళం అందించారన్నారు. దీంతో కళాశాలలో విద్యార్థులకు అవసరమైన పలు రకాల వస్తువులను సమకూర్చినట్లు తెలిపారు. ఒక ఆదోని పాలిటెక్నిక్ కళాశాలకే కాకుండా రాష్ట్రంలోని పలు పాలిటెక్నిక్ కళాశాలలకు రూ. 50లక్షల మేర సాయం అందించినట్లు చెప్పారు. జింకా సుబ్బరాయుడు భార్య జింకా జ్యోతి కూడా ఉపాధ్యాయురాలిగా పనిచేస్తున్నారని.. భార్య భర్తలు పిల్లల విద్యాభివృద్ధికి సహకారం అందించడం అభినందనీయమన్నారు.

బాల్య వివాహాలు చట్ట రీత్యా నేరం

నందవరం : బాల్య వివాహాలు చేసినా, ప్రోత్సహించిన చట్టా రీత్యా నేరమని సీడీపీఓ సఫర్నీసాబేగం అన్నారు. గురువారం మండల కేంద్రంలోని మండల పరిషత్ కార్యాలయంలో 'కిశోర వికాసం' అనే కార్యక్రమంపై మహిళ పోలీసులు, అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆశా వర్కర్లు, ఏఎన్‌ఎంలు, పొదుపు మహిళలకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ.. చిన్న వయస్సులో పెళ్లిలు చేస్తే జరిగే నష్టాలు, అనర్థాలపై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. కిశోర బాలికల ఎదుగుదల, రక్త హీనత అంశాలపై అవగాహన కల్పించామన్నారు. కార్యక్రమంలో ఏఓ కృష్ణమూర్తి, సీహెచ్‌ఓ బలరాముడు, అంగన్‌వాడీ సూపర్‌వైజర్లు సుచరిత, సుధావతి పాల్గొన్నారు.

శ్రీమఠంలో కర్ణాటక మాజీ సీఎం



పీఠాధిపతి చేతుల మీదుగా జ్ఞాపిక అందుకుంటున్న మాజీ సీఎం యడ్యూరప్ప, శివమొగ్గ ఎంపీ బీవై రాఘవేంద్ర

మంత్రాలయం : రాఘవేంద్రస్వామి దర్శనార్థం కర్ణాటక మాజీ సీఎం, బీజేపీ నేత యడ్యూరప్ప, శివమొగ్గ ఎంపీ బీవై రాఘవేంద్ర కుటుంబ సమేతంగా మంత్రాలయం విచ్చేశారు. గురువారం ఉదయం శ్రీమఠానికి చేరుకోగా శ్రీమఠం అధికారులు మఠం మర్యాదలతో ఆహ్వానం పలికారు. ముందుగా గ్రామ దేవత మంచాలమ్మకు అర్చన సహిత హారతులు పట్టి మొక్కులు తీర్చుకున్నారు. అనంతరం రాఘవేంద్రస్వామి మూల బృందావనం వద్దకు చేరుకుని ప్రత్యేక పూజలు చేసుకున్నారు. ఈ సందర్భంగా శ్రీమఠం పీఠాధిపతి సుబుధేంద్రతీర్థులు ఇరువురికి రాఘవేంద్రుల జ్ఞాపిక, శేషవస్త్రం, ఫల, పూల మంత్రాక్షింతలు అందజేసి ఆశీర్వదించారు.

లారీ ఢీకొని వ్యక్తికి గాయాలు

నందవరం : మండల పరిధిలోని ముగతి గ్రామ సమీపంలో ప్లేగమ్మ దేవాలయం వద్ద ఐచర్ లారీ ఢీకొని శివ అనే వ్యక్తి తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు, పోలీసులు, తహసీల్దార్ శ్రీనివాసులు తెలిపిన వివరాలు ఇవి.. పూలచింత గ్రామానికి చెందిన శివ గురువారం ఎమ్మిగనూరు నుంచి స్వగ్రామానికి ద్విచక్ర వాహనంపై బయలు దేరాడు. ప్లేగమ్మ దేవాలయం వద్దకు రాగానే నాగలదిన్నె పైపు నుంచి ఎమ్మిగనూరుకు వెళ్తున్న ఐచర్ లారీ ఎదురుగా వచ్చి ఢీకొంది. ఈ ప్రమాదంలో శివ కుడి కాలు, కుడి చేయి విరిగింది. రీ సర్వే పనుల నిమిత్తం నందవరం తహసీల్దార్ శ్రీనివాసులు ముగతి గ్రామానికి వెళ్తుండగా ఈ ప్రమాదం చోటు చేసుకుంది. స్పందించిన ఆయన అంబులెన్స్‌కి ఫోన్ చేసి క్షతగాత్రుడిని దగ్గరుండి అంబులెన్స్‌లో ఎక్కించి ఎమ్మిగనూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి మానవత్వాన్ని చాటుకున్నాడు. చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం డాక్టర్లు కర్నూలు ప్రభుత్వ ఆసుపత్రికి రెఫర్ చేశారు. పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని విచారణ చేపట్టి కేసు నమోదు చేసినట్లు హెడ్‌కానిస్టేబుల్ కొండదరామిరెడ్డి తెలిపారు.

దర్గాలో భక్తుల సందడి



స్వామి సన్నిధిలో ఫాతెహాలు చేస్తున్న భక్తులు

కౌతాళం: మండల కేంద్రమైన కౌతాళంలో మత సామరస్యానికి ప్రతీకగా వెలుగొందుతున్న జగద్గురు ఖాదర్‌లింగ స్వామి దర్గాకు గురువారం భక్తులు తరలివచ్చి స్వామి సన్నిధిలో భక్తిశ్రద్ధలతో ఫాతెహాలు, ప్రార్థనలు జరుపుకున్నారు. దీంతో దర్గా పరిసరా ప్రాంతాలన్నీ భక్తులతో సందడిగా మారాయి. వివిధ ప్రాంతాల నుంచి తరలివచ్చిన భక్తులు పిండి వంటలు వండి స్వామికి నైవేద్యం సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. తెల్లవారుజామున ఐదు గంటలకు దర్గా ధర్మకర్త సయ్యద్ మున్నపాషా చిష్తీ, పీఠాధిపతి ఖాదర్‌బాషా చిష్తీలు స్వామి సమాధికి గంధం పూసి ప్రత్యేక ఫాతేహాలను చేపట్టారు.

కిశోరి వికాసంపై శిక్షణ

ఆదోని సెంట్రల్: ఐసీడీఎస్ ప్రాజెక్టు పరిధిలోని బాలికలకు కిశోరి వికాసంపై బాలికలకు ప్రత్యేక వేసవి శిక్షణ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు సీడీపీఓ ఉమామహేశ్వరి గురువారం తెలిపారు. ఈ శిక్షణలో 11 నుంచి 18 సంవత్సరాల వయసు గల బాలికలకు ఆత్మ విశ్వాసం, ధైర్యం , మనో నిబ్బరంతో పాటు సొంత అభిప్రాయాలను పెంపొందించుకునే విధంగా సూచనలివ్వడం జరుగుతుందన్నారు. జీవన నైపుణ్యాలను పెంపొందింప చేయడానికి 2వ తేదీ నుంచి జూన్ 10వ తేదీ శిక్షణ కార్యక్రమాలు జరుగుతాయన్నారు. అంగన్‌వాడీ కేంద్రం పరిధిలోని బాలికలు ఈ శిక్షణ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని వారు కోరారు.

వ్యక్తి ఆత్మహత్యాయత్నం

ఆదోని అర్బన్: మండలంలోని ఆరేకల్ గ్రామానికి చెందిన నాగేంద్ర గురువారం ఇంట్లో పురుగుమందు సేవించి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. తాలూకా పోలీసులు తెలిపిన మేరకు వివరాలు నాగేంద్ర కుమార్తె, అల్లుడు పంచాయతీ విషయంలో మనస్తాపానికి గురై ఇంట్లో పురుగుమందు సేవించి అస్వస్థతకు గురయ్యాడు. వెంటనే కుటుంబ సభ్యులు ఆదోని ప్రభుత్వ ఏరియా ఆసుపత్రికి తరలించారు.

అభివృద్ధి పనులపై సమీక్ష

ఎమ్మిగనూరుటౌన్: నియోజకవర్గ పరిధిలోని పలు అభివృద్ధి పనులపై గురువారం స్థానిక మున్సిపల్ కార్యాలయంలోని చైర్మన్ చాంబర్‌లో ఎమ్మెల్యే బీవీ జయనాగేశ్వర్‌రెడ్డి సంబంధిత శాఖ అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఆర్‌డబ్ల్యూసీఎస్, పంచాయతీరాజ్, ఉపాధి హామీ, పట్టణాభివృద్ధి తదితర శాఖల్లో పనులపై ఆయా శాఖల అధికారులను ఆరా తీశారు. పనులను వేగవంతం చేయాలని అధికారులను ఆదేశించారు.

ప్రవేశ పరీక్షలో 68 మంది ఉత్తీర్ణత

కోసిగి: మండల కేంద్రంలోని మోడల్ స్కూల్‌లో 2025–2026వ విద్యా సంవత్సరంలో 6వ తరగతి ప్రవేశ పరీక్ష ఫలితాల్లో 68 మంది విద్యార్థులు ఉత్తీర్ణత సాధించినట్లు ఆ పాఠశాల ప్రిన్సిపాల్ సమీరా రెడ్డి తెలిపారు. గురువారం ఆమె మాట్లాడుతూ ఈ విద్యా సంవత్సరానికి గానూ 6వ తరగతి ప్రవేశానికి 142 పరీక్షలు రాయగా.. 68 మంది విద్యార్థులు ఉత్తీర్ణత సాధించినట్లు చెప్పారు. ఇందులో జంపాపురం ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న అఖిల అనే విద్యార్థిని 100 మార్కులకు గానూ 68 మార్కులు సాధించి ప్రథమ స్థానంలో నిలిచినట్లు తెలిపారు.

ఆర్థిక సాయం

ఆదోనిటౌన్: పట్టణంలో చాకలి గిరి అనే రజకుడు గుండెపోటుకు గురై బుధవారం మృతి చెందాడు. విషయం తెలుసుకున్న రజక సంఘం నాయకులు ఈ విషయాన్ని మాజీ ఎమ్మెల్యే సాయిప్రసాద్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లారు. దీంతో స్పందించిన ఎమ్మెల్యే బాధిత కుటుంబానికి రూ.5 వేలు మట్టి ఖర్చుల కోసం సాయం అందించేలా చర్యలు తీసుకున్నారు. ఈ మేరకు గురువారం వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు బాధిత కుటుంబానికి నగదును అందజేశారు.

పింఛన్ల పంపిణీ



వృద్ధురాలికి పింఛన్ అందిస్తున్న మున్సిపల్ కమిషనర్

ఎమ్మిగనూరుటౌన్: పట్టణంలోని పలు వార్డుల్లో గురువారం పింఛన్ల పంపిణీ చేశారు. పట్టణంలోని ప్రభుత్వ ఆసుపత్రి లైన్‌లో మున్సిపల్ కమిషనర్ గంగిరెడ్డి పింఛన్లు అందజేశారు. కార్యక్రమంలో వార్డు సచివాలయ సెక్రటరీ సుభాన్ తదితరులు పాల్గొన్నారు.

ఎస్సీ కార్పొరేషన్ రుణాలకు దరఖాస్తు చేసుకోండి

ఎస్సీ కార్పొరేషన్ ద్వారా 2025–26వ ఆర్థిక సంవత్సరానికి గాను సబ్సిడీ రుణాలకు అర్హులైన వారు దరఖాస్తు చేసుకోవాలని మున్సిపల్ కమిషనర్ గంగిరెడ్డి గురువారం తెలిపారు. అర్హులైన వారు ఆధార్ కార్డ్, రేషన్ కార్డు, కుల ధ్రువీకరణ పత్రం, విద్యార్హతల సర్టిఫికెట్లతో ఈనెల 10వ తేదీలోగా సంబంధిత వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

ఆలయ అభివృద్ధికి విరాళం



దాతలకు తీర్థప్రసాదాలను అందజేస్తున్న దృశ్యం

కౌతాళం: ఉరుకుంద గ్రామంలో వెలసిన ఈరన్న స్వామి దేవాలయం వద్ద చేపడుతున్న వివిధ అభివృద్ధి, జీర్ణోద్ధరణ పనులకు గురువారం భక్తులు విరివిగా విరాళాలు అందజేసి తమ భక్తిని చాటుకున్నారు. జీర్ణోద్ధరణ కోసం అనంతపురం వాస్తవ్యులైన సూర్యనారాయణ వారి కుటుంబ సభ్యులు రూ.50,116వేల నగదు రూపంలో అందజేసినట్లు ఆలయ డిప్యూటి కమిషనర్ విజయరాజు తెలిపారు. దాతలకు ఆలయ అధికారులు సంప్రదాయం ప్రకారం స్వామి సన్నిధిలో ప్రత్యేక పూజలను చేయించి స్వామి వారి తీర్థప్రసాదాలను, పూలమాల, స్వామి వారి శేష వస్త్రాలు అందజేశారు.



కోసిగిలో ఉపాధి కూలీలతో కలిసి కేక్ కట్ చేస్తున్న ఏఐవైఎఫ్ జిల్లా సహాయ కార్యదర్శి రాజు



ఎమ్మిగనూరులో బైక్ ర్యాలీని ప్రారంభిస్తున్న సీపీఐ జిల్లా కార్యదర్శి గిడ్డయ్య



ఆదోనిలో ఉరుకుందప్ప స్థూపం వద్ద జెండా ఎగురవేస్తున్న సీపీఐ(ఎంఎల్) నాయకులు

ఘనంగా మే డే

ఆదోని రూరల్ : ఆదోని పట్టణంలో గురువారం మే డేను ప్రజా, కార్మిక సంఘాల నాయకులు ఘనంగా నిర్వహించుకున్నారు. సీపీఐ (ఎంఎల్) ఆధ్వర్యంలో న్యూడెమోక్రసీ జిల్లా కార్యదర్శి కె.నాగరాజు స్థానిక పార్టీ కార్యాలయం ఎదుట ఉరుకుందప్ప స్థూపం వద్ద ఎర్రజెడాలను ఎగురవేశారు.

- ఏఐఎఫ్‌టీయూ ఆధ్వర్యంలో రాయల్ మీల్‌పై కొట్టాల వద్ద ఉల్లిగడ్డల వీరన్న స్థూపం వద్ద స్మారక సభ నిర్వహించారు. ఏఐఎఫ్‌టీయూ జిల్లా కార్యదర్శి గంగన్న, బి.సత్యన్న జెండా ఆవిష్కరించారు.
- సీఐటీయూ ఆధ్వర్యంలో పట్టణంలో 25 ప్రాంతాల్లో జెండా ఆవిష్కరణ చేశారు. సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎండి అంజిబాబు, జిల్లా ఉపాధ్యక్షులు ఈరన్న, రైతు సంఘం జిల్లా అధ్యక్షులు వెంకటేశులు తదితరులు పాల్గొన్నారు.
- ఐఎఫ్‌టీయూ ఆధ్వర్యంలో ఆదోనిలోని భీమాస్ సర్కిల్ వద్ద మే డేను నిర్వహించారు. సీపీఐ ఎంఎల్‌న్యూ డెమోక్రసీ జిల్లా కార్యదర్శి మల్లి కార్జున, పీఓడబ్ల్యూ మహిళా సంఘం జిల్లా కార్యదర్శి మణి, మహాదేవమ్మ తదితరులు పాల్గొన్నారు.

మంత్రాలయం : మండల కేంద్రంలో మేడే సందర్భంగా సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి భాస్కర్ యాదవ్ ఏఐటీయూసీ జెండాను ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ మండల కార్యదర్శి మాబుసాబ్, ఏఐవైఎఫ్ మండల కార్యదర్శి రాజు, ఏఐకేఎస్ మండల కార్యదర్శి అబ్దుల్ హనీఫ్, నాయకులు పాల్గొన్నారు.

కోసిగి: మండల కేంద్రంలో సీఐటీయూ ఆధ్వర్యంలో కార్మికులు బస్టాండ్ ప్రాంగణం, వైఎస్సార్ సర్కిల్ వరకు ర్యాలీగా చేరుకున్నారు. పలు ప్రాంతాల్లో జెండాలను వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు లింగన్న ఆవిష్కరించారు. సీఐటీయూ మండల కార్యదర్శి రాముడు పాల్గొన్నారు. సీపీఐ కార్యాలయం ఆవరణలో మండల కార్యదర్శి గోపాల్ ఆధ్వర్యంలో ఏఐటీయూసీ జెండాను ఆవిష్కరించారు. ఉపాధి కూలీలతో కలిసి ఏఐవైఎఫ్ జిల్లా సహాక కార్యదర్శి రాజు ఆధ్వర్యంలో కేక్ కట్ చేసి కార్మిక దినోత్సవం జరుపుకున్నారు.

కౌతాళం: సీపీఎం ఆధ్వర్యంలో సీఐటీయూ, డీవైఎఫ్ఐ, సీపీఐ ఆధ్వర్యంలో నాయకులు స్థానిక వైఎస్సార్ సర్కిల్‌లో ఆయా కార్మిక సంఘాల జెండాలను ఆవిష్కరించారు. సీపీఎం మండల కన్వీనర్ ఈరన్న, డీవైఎఫ్ఐ నాయకుడు వీరేష్, సీనియర్ నాయకులు మల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

పెద్దకడబూరు : మండల కేంద్రంలో సీపీఎం, సీపీఐ ఆధ్వర్యంలో వేర్వేరుగా జెండాలను ఎగరవేసి మేడే వేడుకలను ఘనంగా జరుపుకున్నారు. సీపీఎం మండల కార్యదర్శి తిక్కన్న, సీనియర్ నాయకులు పరమేష్, సీపీఐ మండల కార్యదర్శి వీరేష్, రైతుసంఘం నాయకులు మబ్బు ఆంజనేయ తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మిగనూరుటౌన్: పట్టణంలో ఏఐటీయూసీ జెండాను సీపీఐ జిల్లా కార్యదర్శి గిడ్డయ్య ఆవిష్కరించి, కార్మికుల బైక్ ర్యాలీని ప్రారంభించారు. సీఐటీయూ, ఐఎఫ్‌టీయూ, సీపీఐఎంఎల్ న్యూడెమోక్రసీ జెండాలను ఆయా సంఘాల నాయకులు గోవిందు, రంగన్న రాముడు, అనీఫ్, తిమ్మగురుడు, బాలరాజు, ఏసేపు తదితర సంఘాల నాయకులు ఆవిష్కరించారు. పట్టణంలో ర్యాలీలు చేపట్టారు.

గోనెగండ్ల : మండల కేంద్రం గోనెగండ్లతో పాటు హెచ్. కైరవాడి, అలువాల గ్రామాల్లో సీఐటీయూ, ఏఐటీయూసీ ఆధ్వర్యంలో మేడే వేడుకలను ఘనంగా జరుపుకున్నారు. ఆటో వర్కర్స్ యూనియన్, గ్రామ పంచాయతీ, కార్యకర్తలతో కలసి ఆయా సంఘాలు నాయకులు అబ్దుల్లా, నాగప్ప, కరుణాకర్‌లు జెండాను ఆవిష్కరించారు.

నందవరం : మండల కేంద్రంలోని కిష్టప్ప స్థూపం వద్ద సీపీఐ నాయకులు పంపన్నగౌడ్ జెండాను ఆవిష్కరించారు. అలాగే బస్టాండ్ ప్రాంగణం వద్ద సీపీఎం, సీఐటీయూ, ఎస్ఎఫ్ఐ, ఆశా వర్కర్ల యూనియన్ జిల్లా కార్యదర్శి శివలక్ష్మి జెండా ఆవిష్కరణ గావించారు. కార్యక్రమంలో నాయకులు రంగప్ప, దేవపుత్ర, ఏల్లేష్, మాధవి, రామలలక్ష్మి, వసంత తదితరులు పాల్గొన్నారు.



నందవరంలో జెండాను ఆవిష్కరిస్తున్న సీపీఐ జిల్లా కార్యవర్గ సుభ్యుడు పంపన్నగౌడ్